క్లుప్తంగా

అభ్యంతరాలపై వినతుల స్వీకరణ



ఎల్లారెడ్డిరూరల్: డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి వివిధ కారణాలతో తిరస్కరణకు గురైన వారి నుంచి అధికారులు తిరిగి వినతులను స్వీకరించారు. ఇందుకోసం శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు.

వైభవంగా శివాజీ విగ్రహ ప్రారంభోత్సవం



నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం గుండూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే హన్మంత్ సింధే, కాంగ్రెస్ నేతలు గంగారాం, లక్ష్మీకాంతరావ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పాఠశాలకు టీవీ వితరణ



సదాశివనగర్: మండలంలోని తిమ్మోజివాడి ప్రాథమికోన్నత పాఠశాలకు వాణి అనే ఉపాధ్యాయురాలు టీవీ ఇచ్చినట్లు సర్పంచ్ పొన్న స్వప్న శంకర్, ఉప సర్పంచ్ రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి: మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై శనివారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్ లేని, హెల్మెట్లు ధరించని వాహనదారులకు జరిమానా విధించారు.

కాంగ్రెస్‌లో విభేదాలు సృష్టించొద్దు



గాంధారి: కాంగ్రెస్‌లో విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తే ఊరుకోమని ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు పేర్కొన్నారు. గాంధారిలో కాంగ్రెస్‌కు చెందిన ఎంపీటీసీ కామెల్లి బాల్‌రాజు, నాయకులు లైన్ రమేష్, మధార్ తదితరులు శనివారం మీడియాతో మాట్లాడుతూ అధిష్టానం ఆదేశిస్తే కామారెడ్డి నుంచి పోటీ చేస్తానని మాజీ ఎంపీ అజారుద్దీన్ లింగంపేటలో మాట్లాడటం సరికాదన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి



నిజాంసాగర్: మండలంలోని ముగ్దుంపూర్, గిర్నితండా పంచాయతీల్లోని వన నర్సరీలను శనివారం ఏపీవో శ్రీనివాస్ పరిశీలించారు. తెలంగాణ హరితహారం కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో 10 వేల మొక్కలు సిద్ధం చేయాలని క్షేత్ర సహాయకులను ఆయన ఆదేశించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్లు చంద్రశేఖర్‌రావు, బాల్‌సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ గంగారాం తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

రుద్రూర్: చందూర్ మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తున్న ట్లు ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ రవికుమార్ తెలిపారు. రుద్రూర్ మండల కేంద్రంలోని ఏ డీఈ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. వేదికలో కోటగిరి, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా మండలాలకు సంబంధించి విద్యుత్ సమ స్యలు ఉన్న వినియోగదారులు రావాలన్నారు.

ఆయుర్వేద వైద్య సేవలు బంద్

- ఆరు నెలలుగా వైద్యశాలకు తాళం
- డిప్యుటేషన్‌పై హైదరాబాద్ వెళ్లిన డాక్టర్
- ఫార్మసిస్టు, ఎంఎన్‌వో పోస్టులు ఖాళీ



దోమకొండలోని ఆయుర్వేద వైద్యశాల

దోమకొండ: ఆయుర్వేద వైద్యం అందని ద్రాక్షగా తయారైంది. దోమకొండలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల గతంలో ఇరుకు గదిలో ఉండేది. దీంతో ఇబ్బందులు అధిగమించేందుకు రూ.7.50 లక్షలతో సొంత భవనం నిర్మించారు. సేవలు నిరంతరం అందుతాయని ఆశించిన ప్రజలకు నిరాశ ఎదురౌతోంది. గతంలో ఇక్కడ పని చేసిన డాక్టర్ వెంకటేశ్వర్లు, ఫార్మసిస్ట్ శ్రీనివాస్ మూడేళ్ల కిందట బదిలీపై మరో చోటకు వెళ్లడంతో సిబ్బంది లేక అప్పట్లో ఆస్పత్రికి తాళం వేశారు. ఆరు నెలల కిందట శ్రీదేవిని ఆయుర్వేద వైద్యురాలుగా నియమించినా రెండు నెలల తర్వాత డిప్యుటేషన్‌పై హైదరాబాద్ వెళ్లారు. ప్రస్తుతం ఆస్పత్రిలో డాక్టర్‌తోపాటు, ఫార్మాసిస్టు, ఎంఎన్‌వో పోస్టులు ఖాళీగా ఉండటంతో తప్పని పరిస్థితుల్లో ఆస్పత్రికి తాళం వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయుర్వేద వైద్యశాలకు గతంలో మందుల కోసం మండలానికి చెందిన వివిధ గ్రామాలతో పాటు మాచారెడ్డి మండలంలోని పరీద్‌పేట, పాల్వంచ, ఎల్పుగొండ, వాడి, బండరామేశ్వర్‌పల్లి, భిక్కనూరు మండలంలోని కాచాపూర్, పెద్దమల్లారెడ్డి, కంచర్ల, ఇసన్నపల్లి గ్రామలకు చెందిన వారు వచ్చేవారు. ముఖ్యంగా కీళ్లు, కాళ్ల నొప్పులు, చర్మ వ్యాధులు, మొలలు, పక్షవాతం, స్త్రీలకు సంబంధించిన పలు వ్యాధులకు ఎక్కువ మంది ఆయుర్వేద మందులను వినియోగించే వారు. వాటి వల్ల ఫలితం ఉండటంతో ఎక్కువ మంది మందుల కోసం ఆస్పత్రి వద్దకు వస్తున్నారు. తాళం వేసి ఉండటంతో తప్పనిపరిస్థితుల్లో వెనుదిరిగి వెళ్తున్నారు.

సిబ్బందిని నియమించాలి



ఆయుర్వేద వైద్యశాలకు ఎప్పుడూ తాళం వేసి ఉంటుంది. గతంలో చికిత్స చేసి మంచి మందులను ఇచ్చే వారు. సిబ్బందిని నియమించి ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకరావాలి. – ముద్దసాని చంద్రం, దోమకొండ

అధికారులు స్పందించాలి



ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బంది ఉండేలా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. ఆస్పత్రి భవనానికి తాళం వేసి ఉన్నా ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదో. – సామల నర్సింలు, దోమకొండ

భిక్కనూరులో మందులు ఇస్తున్నాం

దోమకొండ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో సిబ్బంది ఎవరూ లేరు. చాలా మంది భిక్కనూరులో ఉన్న ఆస్పత్రికి వచ్చి మందులు తీసుకుంటున్నారు. తాను జిల్లా కో ఆర్డినేటర్‌గా ఉంటూ భిక్కనూరులో రెగ్యులర్ డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నా. – వెంకటేశ్వర్లు, జిల్లా కో ఆర్డినేటర్, ఆయుర్వేద విభాగం



గాంధారి మండల శివారులో జొన్న పంటలో ఏర్పాటు చేసిన మైకు

ఐడియా అదిరింది..





జొన్న పంటను పక్షులు, ఆడవి పందుల నుంచి రక్షించుకునేందుకు కామారెడ్డి జిల్లా గాంధారి మండల శివారులో ఓ రైతు పొలం మధ్యలో అక్కడక్కడ మైకులను ఏర్పాటు చేశాడు. మైక్ ద్వారా అరుపులు, కేకలు వచ్చేలా రికార్డు చేసి ఉంచాడు. అరుపులకు పక్షులు, ఆడవి పందులు జొన్న పంట దరిదాపులకు రావడం లేదని రైతు తెలిపారు.

–సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

పేదలకు అండగా ప్రభుత్వం



లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ అనంతరం మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నస్రుల్లాబాద్(బీర్కూర్): పేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల దేవస్థానం అతిథి గృహంలో బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం మాట్లాడుతూ బాన్సువాడ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే లక్ష్యంగా పని చేసున్నామన్నారు. సొంత స్థలంలో నిర్మించుకున్న వారికి బిల్లులను చెక్కు రూపంలో అందించారు. బీర్కూర్ మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన గంగారాం ప్రమాదంలో మరణించడంతో పార్టీ తరపున రూ. 2 లక్షల బీమా డబ్బులు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీలు పాల్త్య విఠల్, రఘు, తహసీల్దార్ రాజు, బావయ్య, ఎంపీడీవోలు సుబ్రమణ్యం, భాను ప్రసాద్, నాయకులు పెర్క శ్రీనివాస్, ద్రోణవల్లి సతీస్, డి.శ్రీనివాస్, కిషోర్ యాదవ్, రాజు పాల్గొన్నారు.



పిట్లంలో చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పిట్లం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆసర పింఛన్, దళితబంధు, రైతు బంధు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి తదితర పథకాలు పేదలకు వరం లాంటివని ఎమ్మెల్యే హన్మంత్ సింధే పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పలువురి లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

వేతనాలు ఇవ్వలేదని కార్మికుల భిక్షాటన



దోమకొండలో భిక్షాటన చేస్తున్న కార్మికులు

దోమకొండ: గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలో శనివారం కార్మికులు భిక్షాటన చేశారు. జీతాలు లేక కుటుంబ జీవనం ఇబ్బందికరంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించకపోతే 13న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు సంతోష్‌కుమార్, కార్మికులు నర్సింలు, రాజయ్య, శివరాజు, రాంచంద్రం, పోశయ్య, పెంటయ్య, గంగాధర్, వెంకటి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధ్యక్షుడు 'బండి' దిష్టిబొమ్మ దహనం

- ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ ఆరోపణ
- చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లలో బీఆర్‌ఎస్ నేతల ఫిర్యాదు



బాన్సువాడలో బండి సంజయ్ దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బాన్సువాడ టౌన్/ఎల్లారెడ్డి రూరల్/గాంధారి/సదాశివనగర్: ఎమ్మెల్సీ కవితపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొంటూ శనివారం బాన్సువాడ, ఎల్లారెడ్డి, సదాశివనగర్‌లలో ఆయన దిష్టి బొమ్మలను బీఆర్‌ఎస్ నాయకులు దహనం చేశారు. అదేవిధంగా ఆయన్ను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ గాంధారి, సదాశివనగర్ పోలీస్ స్టేషన్లలో బీఆర్‌ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు.



ఎల్లారెడ్డిలో..



గాంధారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తూ..



సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో..

సిమెంట్ రోడ్లతో గ్రామాలకు మహర్దశ



వజ్జపల్లిలో పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ



రామారెడ్డిలో..

సదాశివనగర్: సిమెంట్ రోడ్లతో గ్రామాలకు మహర్దశ రానుందని ఎంపీపీ గైని అనసూయ, జెడ్పీటీసీ నర్సింలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని వజ్జపల్లిలో వారు సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం నర్సయ్య, ఉప సర్పంచ్ ప్రభాకర్ రావు, ఎంపీటీసీ రాంచందర్ రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: మండల కేంద్రమైన రామారెడ్డిలో సర్పంచ్ సంజీవ్, వార్డు మెంబర్ గాయిత్రి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రజిత, భాగ్యలక్ష్మి, వార్డు సభ్యులు సుంకోజీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని పోతాయిపల్లిలో సర్పంచ్ ఆకుల లక్ష్మినారాయణ సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అంజయ్య, ఎంపీటీసీ కళ్యాణి, దత్తు, ఆశయ్య, హరీష్, మల్లయ్య, సంగయ్య, కాశీరాం, సత్తయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని వెల్లుట్ల, కళ్యాణి గ్రామాల్లో సర్పంచులు రాజేశ్వరి, రఘువీర్‌గౌడ్ సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వెల్లుట్ల సొసైటీ చైర్మెన్ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని బండపల్లి గ్రామంలో మాజీ ఎంపీపీ రజనీకాంత్‌రెడ్డి సిమెంట్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భాగ్యమ్మ, సహకార సంఘం వైస్ చైర్మన్ రాములు, వార్డు సభ్యులు శోభ, లక్ష్మన్, శ్రీకాంత్, సాయిలు, రవి పటేల్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపేట మండలం పోతాయిపల్లిలో..



పిట్లం మండలం బండపల్లిలో..

మాయమాటలు చెప్పేవారిని ఓడించాలి

కామారెడ్డి అర్బన్: మాయమాటలు చెప్పే వారిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు పి.రాఘవరెడ్డి, రాష్ట్ర బాధ్యులు భాస్కరాచారి సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల శాసనమండలి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాతీయవాద నాయకుడు ఏవీఎన్ రెడ్డి విజయానికి మద్దతు ప్రకటించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ మేరకు ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఏవీఎన్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రతినిధులు లక్ష్మిపతి, అంజనేయులు, భాస్కర్, రమేష్‌గౌడ్, దత్తాచారి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న తపస్ నాయకులు

ఆధ్యాత్మికం

■ సిద్ధరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



భిక్కనూరు: శ్రీ సిద్ధరామేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం భిక్కనూరులో ఘనంగా ప్రారంభించారు. బ్రహ్మోత్సవాలు ప్రారంభించక ముందు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం సిద్ధ రామేశ్వరస్వామి, మాత భువనేశ్వరి దేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించారు. సిద్ధగిరి సమాధి వద్ద పూజలు నిర్వహించి విగ్రహాలను తిరిగి దేవాలయానికి తీసుకెళ్లారు.

■ రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం

నిజాంసాగర్: మండలంలోని మహమ్మద్‌నగర్ గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభమైయ్యాయి. శనివారం దేవిపూజ, గడ పావనము, కంకణధారణ, కాటమయ్య పూజ, లంద వెల్లుట, జోగి కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ, గౌడ సంఘం నాయకులు మోతె రామాగౌడ్, గంగాగౌడ్, లక్ష్మాగౌడ్, క్రిష్టాగౌడ్, విఠల్‌గౌడ్, రాజాగౌడ్ తెలిపారు.

■ వైభవంగా గౌరీ సమేత ఓంకారేశ్వర స్వామి కల్యాణం



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ఓంకారేశ్వరాలయంలో గౌరీ సమేత ఓంకారేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ధర్మశాల నుంచి పాత బస్టాండ్ మీదుగా భక్తులు కలశాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి అభిషేకం చేశారు. ముఖ్య అతిథులుగా శ్రీ సిద్ధగిరి సదాశివ మహంత్ శివా చార్య స్వామి , గాంధారి గుడిమెట్ వీరమాట్ మహారాజ్ స్వామిజీ హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కపిల ప్రభాకర్, ఉపాధ్యక్షులు మాదంశెట్టి ఆంజనేయులు, పట్నం శ్రీనివాస్, కార్యదర్శి శివరాములు, సభ్యులు ఇంద్రశేఖర్, గంజి సంగమేశ్వర్, మారుతి, జీవన్ దేశాయ్, చంద్రం, కపిల సంగమేశ్వర్ పాల్గొన్నారు.

■ కొనసాగుతున్న ఉత్సవాలు

రాజంపేట: మండలంలోని గుడితండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు కొనసాగుతున్నారు. ఇందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి తన వంతుగా రూ.21 వేలు అందజేశారు. అనంతరం ఆర్గోండ గ్రామంలో నిర్వహిస్తున్న వనదుర్గాదేవి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో గుడితండా సర్పంచ్ దేవిదాస్, ఉప సర్పంచ్ దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.



■ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్: దేవునిపల్లి శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌రావు స్వామి ఆధ్వర్యంలో చందన అభిషేక పూజా కార్యక్రమం నిర్వహించారు. పలువురు భక్తు లు స్వామిని దర్శించుకున్నారు.

■ శబరిమాత ఆశ్రమంలో..



తాడ్వాయి: మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. దివ్యసమాధిని వివిధ రకాల పూలతో అలంకరించి అనంతరం శబరి మాత ప్రతిమను పల్లకీ సేవ నిర్వహించారు.

కంటి పరీక్షలు తప్పనిసరి

తాడ్వాయి: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. మండలంలోని క్రిష్టాజివాడిలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు రాజశేఖర, శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట: మండలంలోని బోనాల్ గ్రామంలో శనివారం సర్పంచ్ సుశీల కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ హిమబిందు, ఉప సర్పంచ్ పరందాములు పాల్గొన్నారు.

సదాశివనగర్: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బద్దం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ఆయన ఉప సర్పంచ్ వంకాయల రవి, ఎంపీటీసీ బీరయ్య, ఏఎంసీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్‌తో కలిసి కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలించారు.



తాడ్వాయి మండలం క్రిష్టాజివాడిలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

వరి పైరు ఎదుగుతలేదు



నాగిరెడ్డిపేటలో సరిగా ఎదగని వరి పైరు

నాగిరెడ్డిపేట: యాసంగిలో సాగు చేసిన వరి పైరుకు తెగులు సోకడంతో పంట ఎదుగుదల సరిగాలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరికి మోతాదుకు మించి యూరియా వాడితో తెగులు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా పలువురి రైతులు వారి సూచనలను పట్టించుకోవడం లేదు. దీనికి తోడు వానాకాలం, యాసంగి పంట సాగు మధ్య తక్కువ విరామం ఉండడం వల్ల భూసారం లేక పంట ఎదుగుదల లోపించడానికి ఒక కారణమని అధికారులు వెల్లడించారు. యూరియా వేస్తే పంట బాగుంటుందనే ఉద్దేశంతో ఎక్కువగా వినియోగించడం వల్ల రైతులు నష్టపోతున్నారు. మొగి పురుగు, అగ్గి తెగులు సోకిన పంటను చాలా మంది రైతులు తొలగించి తిరిగి నాట్లు వేశారు. రైతులు గమనించి అవసరమైన మేరకే యూరియా వాడాలని మండల వ్యవసాయ శాఖ అధికారి విజయ్‌శేఖర్ సూచించారు.